వధువుకు ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న కారంకి వెంకట శివనారాయణ గౌడ్ తదితరులు

కూకట్‌పల్లి: ఆల్విన్‌కాలనీలోని కారంకి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కారంకి మ్యాట్రిమోనీ ద్వారా ఇప్పటికి 450 వివాహాలు కుదిర్చారు. సొంటి గణేష్, కట్ట ఉషారాణి వివాహం సందర్భంగా రూ.5 వేలను వధువు కుటుంబ సభ్యులు కట్ట శ్రీనివాసరావుకు గురువారం అందజేశారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

మూసాపేట: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్టలో నివాసం ఉండే పెద్ద పాపయ్య భరత్ గౌడ్ (36) ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 20 సంవత్సరాలుగా గంజాయికి బానిసయ్యాడు. అమ్ముకుంటే డబ్బులు వస్తాయనే ఆలోచనతో మహారాష్ట్రలోని పర్లీ గ్రామం నుంచి గంజాయి తీసుకువచ్చి వివేకానందనగర్‌లో అమ్ముతుండగా.. సమాచారం మేరకు పోలీసులు భరత్ గౌడ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి కిలో 208 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో మెరుగైన ఫలితాలు సాధించాలి

జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి


శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ విజయకుమారి

రంగారెడ్డినగర్: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించి మెరుగైన విద్యను అందించడం ద్వారా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని డీఈఓ విజయకుమారి అన్నారు. కుత్బుల్లాపూర్ మండలంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు జీడిమెట్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వృత్తి నైపుణ్యంపై శిక్షణా తరగతులను గురువారం ఎంఈఓ జెమిని కుమారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. అనంతరం కోర్స్ డైరెక్టర్, ఎంఈవో జెమిని కుమారి మాట్లాడుతూ.. తెలుగు, ఆంగ్ల మధ్యమాల్లో పరిసరాల పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యాపై ఇస్తున్న శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగిన శిక్షణ తరగతుల్లో మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు హాజరయ్యారు.

మురుగు పరుగు.. ఆరోగ్యం బేజారు!



నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆదిత్య గార్డెన్స్‌లో ప్రధాన రోడ్డుపై డ్రైనేజీ నీరు రోడ్డుపై పరుగులు తీస్తుంది. వారం రోజులుగా డ్రైనేజీ నీరు రోడ్లపై పారుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధాన రోడ్డు కావడంతో వాహనాల రాకపోకల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. నడిచి వెళ్లేందుకు కూడా చాలా ఇబ్బందికరంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడంలో విఫలం అయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు త్వరితగతిన స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


కూకట్‌పల్లి ఏసీపీ రవికిరణ్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న శక్తిపురం పారిశ్రామిక వాడ సంఘం సభ్యులు బండి మధుసూదన్ రెడ్డి, శీరం జగ్గారావు, మహదేవయ్య, కొండారెడ్డి తదితరులు

- మూసాపేట

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి


రంగ నాయక స్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు


కూకట్‌పల్లిలోని దాసాంజనేయస్వామి పూజలో ఎమ్మెల్యే కృష్ణారావు తదితరులు

- ఆలయాల్లో హోమాలు, పూజలు
- తీర్థప్రసాదాలు స్వీకరించిన భక్తులు
- పలు చోట్ల శోభాయాత్ర నిర్వహించిన యువత

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో హనుమాన్ జయంతిని పలు ఆంజనేయ స్వామి దేవాలయాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు ఆలయాలలోని ఆంజనేయ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలను పూలతో, పచ్చని తోరణాలతో అలంకరించారు. ఆంజనేయ స్వామికి ఇష్టమైన వడమాలను సమర్పించి, పట్టు వస్త్రాలతో అలంకరించారు. కలశస్థాపన, పంచామృతాభిషేకం, నాగవల్లి దళార్చన సేవ వంటి పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూకట్‌పల్లిలోని దాసాంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా భరత్‌నగర్‌కాలనీలోని శ్రీహరిహరక్షేత్రంలో హనుమాన్ జన్మదినం పురస్కరించుకొని ఆలయ అర్చకులు యోగానంద లక్ష్మీ నరసింహాచార్యులు సమక్షంలో ఉదయం అభిషేకం, లక్ష తమలపాకుల అర్చన, వంటి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగిరెడ్డి పాల్గొన్నారు. అన్నసమారాధన ప్రారంభించారు. ఐడీఎల్ చెరువు సమీపంలోని రంగనాయక స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఉదయం సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం, సిందూరం పూజ, నాగవల్లి పత్రిక పూజ, విశేష పుష్పాలంకరణ వంటి పూజా కార్యక్రమాలు విశేషంగా జరిగాయి.


ఆల్విన్‌కాలనీ మల్లికార్జున స్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా చదువుతున్న భక్తులు

పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్: పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బాలానగర్‌లోని అతి పురాతనమైన హనుమాన్ ఆలయం శిథిలావస్థలకు చేరింది. దీంతో కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి సొంత నిధులతో గుడి మరమ్మతులు, ప్రహరీ నిర్మాణం, ధ్వజస్తంభం ఏర్పాటుకు గురవారం శంకుస్థాపన చేశారు. అదే విధంగా ఫిరోజ్‌గూడలోని ముఖద్వారం కోసం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పురాతన దేవాలయాలకు తన వంతు తోడ్పాటు నందిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ఆలయ మరమ్మతులు, ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

భాగ్యరెడ్డి సేవలు చిరస్మరణీయం


భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

మూసాపేట: గ్రేటర్ హైదరాబాద్ ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షులు కర్క నాగరాజు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం మాదరి భాగ్యరెడ్డి వర్మ 137 జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర దళిత నాయకుడు కర్క పెంటయ్య హాజరై భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికల కోసం చాదర్‌ఘాట్‌లో 26 బాలికల ఉన్నత పాఠశాలలను స్థాపించారని, ఆయన సేవలను గుర్తించి నిజాం ప్రభుత్వం 26 పాఠశాలల్లో తెలుగు భాషను ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వం ఆయన జీవిత చరిత్రని పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని, ట్యాంక్ బండ్ వద్ద కాంస్య విగ్రహానికి ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ అమరజ్యోతి అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కర్క స్వామి, కర్క దాకయ్య, శివరాజ్ యాదవ్, యాదయ్య యాదవ్, గురజాల రాజు, జగన్, పాషా, రమేష్ పాటిల్, గురజాల రమేష్, కర్క మహేష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లోని పలు బస్తీ, కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు కోసం నిధులు మంజూరు అయ్యేలా కృషి చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేవరింటి మస్తాన్‌రెడ్డి అన్నారు. గురువారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్ జిల్లా కార్యాలయాన్ని కీసరగుట్ట సమీపంలో ఏర్పాటు చేయడంతో అల్లాపూర్ వాసులు వివిధ పనులపై వెళ్లాలంటే సుమారు 5 బస్సులు మారాల్సి వస్తుందని తెలిపారు. అలా కాకుండా నేరుగా బోరబండ నుంచి కానీ పర్వత్‌నగర్ నుంచి కానీ కలెక్టర్ కార్యాలయానికి ఆర్టీసీ బస్సు నడిపేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో చోట మహేష్, జాకీర్, రమేష్, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ, పీజేఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్న అప్పారీ శ్రీలక్ష్మికి సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును గురువారం కాంగ్రెస్ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ గురువారం అందజేశారు. పేదలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.

ముగిసిన ఆలయ వేడుకలు


ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో వడమాలతో భక్తులకు దర్శనమిచ్చిన ఆంజనేయ స్వామి


పర్వత్‌నగర్‌లోని పర్వత వర్ధిని శివాలయంలో పండ్లు, వెండి తమలపాకులతో ..

మోతీనగర్: మూసాపేట డివిజన్ కబీర్‌నగర్, అవంతినగర్, మోతీనగర్ ఎక్స్‌టెన్షన్‌లోని శివరామ ఆంజనేయ స్వామి ఆలయంలో తృతీయ వార్షిక వేడుకలు గురువారం ఘనంగా ముగిశాయి. ముగింపు సందర్భంగా ఆలయంలోని పలు ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా హనుమాన్ జయంతి సందర్భంగా నవ కలశ స్థాపన, నాగవల్లి దళార్చన, వడమాల సేవలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివునికి ప్రత్యేక అలంకరణ చేశారు. అదే విధంగా పాండురంగనగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలోని ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించాలని కలెక్టర్‌ను కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. బండి రమేష్, ఆయా నియోజకవర్గాల బాధ్యులు పాల్గొన్నారు. –కూకట్‌పల్లి



రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన సీపీ


పనులను పరిశీలిస్తున్న సీపీ అవినాష్ మహంతి, అధికారులు

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి జేఎన్‌టీయూహెచ్ చౌరస్తాలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి గురువారం పరిశీలించారు.

హైటెక్ సిటీ వైపు నుంచి కేపీహెచ్‌బీ ఫ్లై ఓవర్ మీదుగా జాతీయ రహదారి వైపు వచ్చే వాహనాలకు రద్దీ తగ్గించే క్రమంలో ఫ్రీ లెఫ్ట్ వైపు రోడ్డు విస్తరణ చేపట్టారు. ట్రాఫిక్ పోలీసుల అభ్యర్థన మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ గత వారం జేఎన్‌టీయూహెచ్ చౌరస్తాను పరిశీలించారు. ప్రహరీ గోడను జరిపి పనులను మొదలు పెట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ట్రాఫిక్ అధికారులతో కలిసి పనులు పరిశీలించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వీరన్న, కూకట్‌పల్లి ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జలవాయు విహార్ కాలనీలో సుమారు రూ.50 లక్షల అంచనా వ్యయంలో భాగంగా అబ్దుల్ కలాం పార్కు రోడ్డులో సీసీ రోడ్డు పనులను అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో అత్యవసరం ఉన్న చోట, నిత్యం సమస్యలతో ఉన్న ప్రాంతాల్లో ప్రాధాన్యతగా పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ జీవితం స్ఫూర్తిదాయకం

పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జీవితం స్ఫూర్తిదాయకమని, ఆయన స్ఫూర్తితో ముందుకెళ్లాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాచరిక నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన ధీరుడని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నే శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.


పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌లు

రోడ్డు భద్రత, వ్యవస్థల బలోపేతంపై సమావేశం

రాయదుర్గం: మౌలిక వసతులు, సమానత్వం, న్యాయాన్ని అనుసంధానించడానికి రోడ్డు భద్రత ఒక శక్తివంతమైనదని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని మాస్ కమ్యూనికేషన్ జర్నలిజం విభాగం సహకారంతో యూనిసెఫ్ ఇండియా గురువారం రోడ్డు భద్రత, వ్యవస్థల బలోపేతంపై జాతీయ మీడియా కన్సల్టేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..లోతుగా ఆలోచించి సానుకూల మార్పులకు దోహదపడే జర్నలిస్టులను సిద్ధం చేయడంలో విశ్వవిద్యాలయం పాత్రను ఆయన నొక్కి చెప్పారు. సురక్షితమైన పాఠశాల, బలమైన అత్యవసర సంరక్షణ వ్యవస్థలు, అవగాహన ప్రచారాలు అన్నీ పాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఏఐ హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయ చీఫ్ జనరల్ మేనేజర్ శివశంకర్, ఐఎస్ఏడీఏకె సీఈఓ రామోన్‌చెసా, యూనిసెఫ్ హైదరాబాద్ చీఫ్ డాక్టర్ జెలాలెమ్‌టఫ్సె, యూనిసెఫ్ ఇండియా హెల్త్ స్పెషలిస్ట్ డాక్టర్ సయ్యద్ హబ్బిఅలీ, స్కూల్ జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ డీన్, హెడ్ ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఐనుల్ హసన్

చందానగర్‌లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర

చందానగర్: మహనీయుల ఆశయాలను కాపాడటంతో పాటు ప్రజలకు స్వేచ్ఛను ప్రసాదించిన రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి దేశ వ్యాప్తంగా జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, స్టాండింగ్ కమిటీ సభ్యులు జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం చందానగర్‌లో రాజ్యాంగ పరిరక్షణకు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర ఎంబీసీ చైర్మన్ జైపాల్, నాయకులతో కలిసి ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఏఐసీసీ, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి, స్పోర్ట్స్ చైర్మన్ శివసేన రెడ్డి, డైరీ కార్పొరేషన్ చైర్మన్ గుట్ట అమిత్‌రెడ్డి నేతృత్వంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో ఆర్డినేటర్ రఘునందన్‌రెడ్డి, టీపీసీసీ లేబర్ సెల్ ఉపాధ్యక్షుడు నల్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు.


పాదయాత్రలో జైపాల్, జగదీశ్వర్ గౌడ్

అగ్నిమాపక భద్రతపై అవగాహన

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని ఎస్పైర్ బయోనెస్ట్ ఇంకుబేషన్ సెంటర్ ప్రాంగణంలో అగ్నిమాపక భద్రతపై అవగాహన కార్యక్రమం, మాక్ డ్రిల్‌ను గురువారం భద్రతా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. అగ్నిమాపక ప్రమాదం చోటు చేసుకుంటే అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై అధికారులు, ఉద్యోగులు, ఇంకుబేషన్ స్టార్టప్‌ల ప్రతినిధులు, యూనివర్సిటీ విద్యార్థులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్ని ప్రమదాలు, భద్రతా పరికరాలు, ఉపశమన వ్యూహాలు, తరలింపు విధానాలపై లోతైన ప్రదర్శనలో చూపించారు. ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా అగ్నిమాపక యంత్రాలు, అత్యవసర సాధనాల సరైన ఉపయోగంపై పాల్గొనేవారు ఆచరణాత్మక శిక్షణను కూడా అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీయూ ఎస్పైర్ బయోనెస్ట్ ఇంకుబేషన్ సెంటర్ అధికారులు, ఉద్యోగులు, స్టార్టప్‌ల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కార్పొరేటర్ జన్మదిన వేడుకలు

ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కార్పొరేటర్‌చే కేక్ కట్ చేయించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్‌టీఆర్ నగర్‌లోని షిరిడీసాయి బాబా దేవాలయంలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. పలువురు జన్మదిన వేడుకలు నిర్వహించారు.

– ఆల్విన్‌కాలనీ


కేక్‌కట్ చేయించి శుభాకాంక్షలు తెలుపుతున్న పీఏసీ చైర్మన్ గాంధీ


కార్పొరేటర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు